


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 02-04-2024 సంపుటి : 06 సంచిక : 203 పేజీలు : 8 వెల : రూ 3-00

## భారత్ ఆర్థికంగా స్వయం సమృద్ధి కావాలి: ప్రధాని మోదీ



ముంబై: రాబోయే పదేళ్లలో దేశం ఆర్థికంగా స్వయం సమృద్ధి కావాలని ప్రధాని మోదీ(ఖఓ ఓనీటతి) ఆకాంక్షించారు. ఎందుకంటే ప్రపంచ దేశాల ప్రభావం భారత్‌పై పడకుండా ఉంటుందన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 90వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడవ సారి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు ఏర్పడిన తర్వాత ప్రతి ఒక్కరికీ కావాల్సినంత పని దొరుకుతుందని అన్నారు. భారత స్వయంసమృద్ధి సత్తాను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకింగ్ రంగం లాభదాయకంగా మారిందన్నారు. గత పదేళ్లలో ప్రభుత్వం, ఆర్బీఐ తీసుకున్న చర్యల వల్ల క్రెడిట్ గ్రోత్ జరుగుతోందన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 2018లో 11.25 శాతంగా ఉన్న ఎన్పీఏలు, 2023 సెప్టెంబర్ నాటికి మూడు శాతానికి పడిపోయినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం బ్యాంకుల్లో 15 శాతం క్రెడిట్ గ్రోత్ నమోదు అవుతోందన్నారు. ఈ ప్రగతిలో ఆర్బీఐ కీలక పాత్ర పోషించినట్లు ప్రధాని మోదీ ప్రశంసించారు.

## కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా వైఎస్ షర్మిల..!



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ పడే అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ పార్టీ ఫైనల్ చేసినట్లు సమాచారం. 117 అసెంబ్లీ స్థానాలకు, 17 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ జాబితాను రేపు అధికారికంగా ప్రకటించనున్నట్లు ఏపీ కాంగ్రెస్ పీసీసీ ప్రెసిడెంట్ వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఇక సీనియర్ నేత, మాజీ పీసీసీ రఘువీరా రెడ్డి ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నట్టు సమాచారం. అటు అసెంబ్లీ, ఇటు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనని, కేవలం ప్రచారంలో మాత్రమే పాల్గొంటానని రఘువీరారెడ్డి అధిష్టానానికి చెప్పినట్లు సమాచారం. ఇక కడప ఎంపీ అభ్యర్థిగా వైఎస్ షర్మిల పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. కాకినాడ నుంచి పల్లం రాజు, బాపట్ల నుంచి జేడీ శీలం, రాజమండ్రి నుంచి గిడుగు రుద్ర రాజు పోటీ చేయనున్నట్లు సమాచారం.

## తీహార్ జైలుకు కేజ్రీవాల్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 ,ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్టైన సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టులో మరో షాక్ తగిలింది. ఆయన్ని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించేందుకు కోర్టు ఓకే చెప్పింది. దీంతో ఆయన్ని కోర్టుకు తరలించారు. కోర్టు ఆదేశాల మంరకు 15 రోజుల పాటు తిహార్ జైలులో ఉండబోతున్నారు. ఇప్పటికే ఇదే కేసులో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అక్కడే ఉన్నారు. ఢిల్లీ డిప్యూటీ సీఎం కూడా అదే జైల్లో ఉన్నారు. లిక్కర్ స్కామ్ కేసులో అరవింద్ కేజ్రీవాల్ మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డారని ఎన్‌ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అధికారులు మార్చి 21 రాత్రి అరెస్టు చేశారు. 22న కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఈడీ కస్టడీకి ఇవ్వడంతో ఏడు రోజుల పాటు విచారించారు. విచారణ గడువు పూర్తి కావడంతో ఇవాళ కోర్టులో హాజరుపరిచారు. 28న విచారణ గడువు ముగిసినప్పటికీ కోర్టుకు సెలవులు కారణంగా ఇవాళ హాజరుపరిచారు. కోర్టులో హాజరుపరిచిన సందర్భంగా ఈడీ తరఫున ఎస్వీ రాజు వాదిస్తూ...విచారణకు కేజ్రీవాల్ సహకరించడం లేదని కోర్టుకు తెలిపారు. ఆయన్ని మరోసారి కస్టడీకిఇవ్వాలనిరిక్వస్ట్‌పెట్టారు.కోర్టులో హాజరుపరిచిన సందర్భంగా ఈడీ తరఫున ఎస్వీ రాజు వాదిస్తూ... విచారణకు కేజ్రీవాల్ సహకరించడం లేదని కోర్టుకు తెలిపారు. ఆయన్ని మరోసారి కస్టడీకి ఇవ్వాలని రిక్వస్ట్ పెట్టారు.ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రధాన సూత్రధారిగా ఆరోపిస్తోంది. ప్రస్తుతం ఈ కేసులో అరెస్టు అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కవిత, మాజీ డిప్యూటీ సీఎంలు మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్ జైలులో ఉన్నారు. ఈ స్కామ్‌లోని డబ్బులనే ఆమ్ ఆద్మీ పార్టీ గోవా ఎన్నికల్లో వినియోగించినట్టు చెబుతోంది. దర్యాప్తు సంస్థ చేస్తున్నఆరోపణలు కేజ్రీవాల్ సహా ఆప్ నేతలు ఖండిస్తున్నారు. లోక్ సభ ఎన్నికల్లో పార్టీ పోటీ చేయకుండా ఉండేందుకే కేంద్రం కక్ష పూరితంగా కేసులు పెట్టి వేధిస్తోందని ?ంటున్నారు.

## కవిత బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా పడింది. సోమవారం కవిత బెయిల్ పిటిషన్ పై విచారించిన సిబిఐ స్పెషల్ కోర్టు.. మెరిట్ అంశాలను పరిగణలోకి తీసుకోకుండా బెయిల్ ఇవ్వలేమని కోర్టు తెలిపింది.ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయస్థానం ఈ నెల 4వ తేదీకి విచారణ వాయిదా వేస్తున్నట్లు చెప్పింది. ఆ రోజు లంచ్ తర్వాత వాదలన వింటామని జడ్జి స్పష్టం చేశారు. కాగా, త పిల్లలకు ఈ నెల 16వరకు కవి పరీక్షలు ఉన్నందున బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆమె తరపు లాయర్లు కోర్టులో పిటి షన్ వేసిన సంగతి తెలిసిందే.



## రాజకీయ స్వార్థం కోసం పెన్షనర్ల పొట్టకొట్టారు



**సొంత మనుషులకు నిధులన్నీ కట్టబెట్టిన జగన్**

**ఎన్నికల ముందు ఖజానా ఖాళీచేసి వెళ్లిన జగన్**

**టిడిపి నేతలు క్షేత్రస్థాయిలో సమస్యను పరిష్కరించాలి**

**బూత్‌లెవల్ కార్యకర్తలతో చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్**

అమరావతి,ఏప్రిల్ 1 : రాజకీయ స్వార్థం కోసం సీఎం జగన్ పెన్షనర్ల పొట్టకొట్టారని తెదేపా అధినేత చంద్రబాబు విమర్శించారు. అధికారం నుంచి దిగిపోతూ కూడా జగన్ పైశాచికత్వం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు.కూటమి అధికారంలోకి రాగానే రూ.4 వేల పింఛన్ ఇస్తామని పునరుద్ఘాటించారు. తెదేపా నేతలు, బూత్ లెవల్ కార్యకర్తలతో సోమవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ రెండు నెలలు ఎవరికైనా పింఛన్ అందకపోతే.. అది కూడా కలిపి ఇస్తామని హామీ ఇచ్చారు. పేదలకు పింఛన్ ఇప్పించే వరకు తెదేపా నేతలు రాజీ పడొద్దన్నారు. కలెక్టర్లను కలిసి పింఛన్ ఇళ్ల వద్దే అందేలా చూడాలన్నారు. ప్రజాక్షేత్రంలో జగన్‌ను దోషిగా నిలబెట్టాలి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత జగన్ రూ.13 వేల కోట్లు గుత్తేదారులకు దోచిపెట్టారు. 15 రోజుల్లో ఎవరెవరికి ఎంత బిల్లులు ఇచ్చారో ప్రకటించాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తాం. తటస్థంగా పనిచేసే వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. వాలంటీర్లకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో మెరుగైన జీతం వచ్చేలా చేస్తాం' అని చంద్రబాబు తెలిపారు. వలంటీర్లవిషయంలో తాము స్పష్టంగా ఉన్నామని.. వారికి ఎలాంటి అన్యాయం జరగదని చంద్రబాబునాయుడు అన్నారు. వలంటీర్లను వైసీపీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలకు వాడుతున్నారనే కారణంతో కేంద్ర ఎన్నికల సంఘం విధులకు దూరం పెట్టిందని తెలిపారు. పెన్షన్లు పంపిణీ చేయొద్దని తాము ఎవరినీ కోరలేదని.. కేంద్ర ఎన్నికల సంఘం కూడా అలా చేయలేదని అన్నారు. ఏపీలో మొత్తం 1.35 లక్షల మంది సచివాలయ సిబ్బంది ఉన్నారని.. వారి ద్వారా ఒక్క రోజులో ఇంటింటికీ పెన్షన్ ఇచ్చే అవకాశం ఉన్నా ప్రభుత్వం వారి సేవలను ఎందుకు వినియోగించుకోట్లేదని చంద్రబాబు ప్రశ్నించారు.ప్రభుత్వ పథకాలకు ఇవ్వాల్సిన డబ్బులు.. సొంత కాంట్రాక్టర్లకు జగన్ ఇచ్చారని మండిపడ్డారు. ఖజానా ఖాళీ చేసి వైసీపీ ప్రభుత్వం పెన్షన్ ఇవ్వలేకపోయిందన్నారు. ఆ నెపాన్ని తమపై, ఎన్నికల సంఘంపై కుట్రపూరితంగా నెడుతోందని ధ్వజమెత్తారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి మద్దతిచ్చే కొంతమంది వలంటీర్లపై తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో వలంటీర్లు తప్పులు చేస్తే కేసులు పెట్టే అవకాశం ఉందని.. వాళ్లూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జగన్ రాజకీయ క్రీడలో వలంటీర్ల జీవితాలను నాశనం చేయాలని చూస్తున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు.సూపర్ సిక్స్, ఎన్నికలల్లో అవలంభించాల్సిన వ్యూహాలు ప్రతి వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశర చేశారు. వైసీపీ ప్రభుత్వం పెన్షన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిన విషయాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. ఒకవేళ పెన్షన్ ఇవ్వకపోతే ఈ నెల నుంచే రూ. 4000 చొప్పున టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తుందని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని చెప్పారు. పెన్షన్ల వ్యవహారాన్ని వైసీపీ నేతలు రాజకీయం చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. పెన్షన్ ప్రతి ఒక్కరికీ అందేలాగా ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. వలంటరీ వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కేడర్‌కు సూచించారు. 'ప్రజాగళం' సభల స్పందన చూస్తుంటే టీడీపీ, మిత్రపక్షాల గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలనే బలమైన భావన, కసి ప్రజల్లో కనిపిస్తోందన్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌రెడ్డికి ఆయన ఓటమి తథ్యమైందని గ్రహించారని అన్నారు. అందుకే టీడీపీపై ఫేక్ ప్రచారాలు, కుట్రలకు తెరదీశారని మండిపడ్డారు. పెన్షన్లపై అబద్దాలు, తప్పుడు ప్రచారాలు జగన్ నీచ రాజకీయాలకు నిదర్శనంగా ఉన్నాయని దుయ్యబట్టారు. ప్రతి నెల 1వ తేదీన ఇంటి వద్దనే పెన్షన్ అందించే విషయంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని మండిపడ్డారు. వృద్ధులు, వికలాంగులకు మానవీయ కోణంలో పెన్షన్ ఇంటి వద్దనే ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు.తన రాజకీయ లబ్ది కోసం నడి వేసవిలో వృద్ధులు, వికలాంగులకు పెన్షన్ ఇవ్వకుండా జగన్ వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులతో ఇంటింటికీ పెన్షన్ ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పెన్షన్ విషయంలో వైసీపీ ప్రభుత్వ కుట్రలు, వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలని టీడీపీ కేడర్‌కు సూచించారు. తన రాజకీయ లబ్ది కోసం బాబాయి వివేకానందారెడ్డిని జగన్ చంపించారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ఓట్ల కోసం ఇలాంటి చాలా కుట్రలకు జగన్ తెరలేపారని విమర్శించారు. తజగన్ ప్రభుత్వం గత 15 రోజుల్లో ఎవరెవరికి బిల్లులు ఇచ్చిందో ప్రకటించాలని డిమాండ్ చేశారు. మే 13వ తేదీ తర్వాత ప్రభుత్వ ఖజానాను మాయం చేసి తన కాంట్రాక్టర్లకు కట్టబెట్టేందుకు జగన్ కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పేదలకు ఇచ్చే డబ్బుల విషయంలో మాత్రం జగన్ నాటకాలు అడుతున్నారన్నారు. ఇంటింటికీ పెన్షన్ ఇచ్చేలా ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం

## జగన్ అక్రమాస్తుల కేసుల్లో విచారణ


**విచారణలో ఆలస్యంపై సిబిఐని ప్రశ్నించిన సుప్రీం**

**నాలుగు వారాలకు కేసు వాయిదా**

న్యూఢిల్లీ,ఏప్రిల్1: జగన్ అక్రమాస్తుల కేసుల్లో విచారణ ఎందుకు ఆలస్యమవుతోందని సీబీఐని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనికి గల కారణాలు చెబుతూ నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని.. విచారణ వేగంగా పూర్తిచేయాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ఆదేశించింది. డిశ్చార్జ్ పిటిషన్ల కారణంగా జాప్యమవుతోందని సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు కోర్టుకు తెలిపారు. రాజకీయ కారణాలతో ట్రయల్ ఆలస్యం కాకూడదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రాజకీయ నేత, సీఎం అనే కారణాలతో విచారణలో జాప్యం జరగకూడదని జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు. బెయిల్ రద్దు, కేసు విచారణ తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ పిటిషన్లను కలిపే విచారణ చేపడతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 5 నుంచి ప్రారంభమయ్యే వారానికి వాయిదా వేసింది. ఏపీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో ఆయన బెయిల్‌ను రద్దు చేయాలన్న ఎంపీ రఘురామ కృష్ణరాజు వేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జగన్ కేసుల విచారణలో జాప్యంపై కారణాలు తెలపాలని సీబీఐని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. రఘురామ పిటిషన్ల పై జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ నిర్వహించింది.

## ఇంటింటికీ పెన్షన్లు పంపిణీ చేయొచ్చు.!!- సీఎస్ జవహర్రెడ్డి..

అమరావతి:ఏప్రిల్ :02.( మహాన్ న్యూస్ )పెన్షన్ల పంపిణీ ప్రక్రియలో వాలంటీర్ల ప్రమేయం ఉండకూడదని ఈసీ ఆదేశాలిచ్చిన నేపథ్యంలో కలెక్టర్లతో సీఎస్ జవహర్రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఇంటింటికీ పెన్షన్లు పంపిణీ చేయవచ్చని పలువురు కలెక్టర్లు కాన్ఫరెన్స్లో తెలిపారు.గ్రామ,వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా వారంలో పెన్షన్లు ఇవ్వొచ్చని చెప్పారు.అర్బన్ ప్రాంతాల్లో కొంచెం కష్ట మవుతుందని పేర్కొన్నారు.



# సంపాదకీయం

మంగళవారం 02-04-2024

## అంతర్గత విషయాలపై ఉత్సాహమెందుకో

భారత అంతర్గత వ్యవహారాల్లో ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుంది. ఇదివరకే కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా, జర్మనీ స్పందించిన విషయం తెల్సిందే. అమెరికా వ్యాఖ్యలపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అమెరికా దౌత్యవేత్తకు భారత్ సమన్లు జారీ చేసింది. అది జరిగిన ఒక్క రోజు వ్యవధిలోనే కేజ్రీవాల్ అరెస్టుపై ఐక్యరాజ్యసమితి రియాక్ట్ అయ్యింది. భారత్‌లో లోక్‌సభ ఎన్నికల ముందు జరుగుతున్న పరిణామాలపై ఐక్యరాజ్యసమితి అధికార ప్రతినిధి స్టెపాన్ డుజారిక్ స్పందించారు. కేజ్రీవాల్ అరెస్టు, ఐటీ శాఖ చేసిన కాంగ్రెస్ అకౌంట్స్ ఫ్రీజ్ తో నెలకొన్న రాజకీయ అనిశ్చితిపై మాట్లాడారు. భారత్ తో పాటు ఎన్నికలు జరిగే ప్రతి దేశంలోనూ రాజకీయ, పౌర హక్కులు రక్షిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. స్వేచ్ఛ, న్యాయమైన వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఓటు వేస్తారని నమ్ముతున్నామన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ను ఇటీవల ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు అరెస్టు చేశారు. ఆయన ప్రస్తుతం ఎన్ ఫోర్స్ మెంట్ అధికారుల విచారణలో ఉన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం లో ఆయన కీలకపాత్ర పోషించారని, ఆయనకు వ్యతిరేకంగా తమ వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పి ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు అరెస్టు చేశారు. అరవింద్ అరెస్టు నేపథ్యంలో ఆప్ నాయకులు నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు జరుపుతూనే ఉన్నారు.. ఇదంతా ఇలా జరుగుతుండగానే.. అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా, జర్మనీ దేశాలు స్పందించాయి. అమెరికా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మాథ్యు మిల్లర్ అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై స్పందించారు. "కేజ్రీవాల్ అరెస్టు వ్యవహారంతో పాటు ఇలాంటి చర్యలను తాము జాగ్రత్తగా పరిశీలిస్తూనే ఉంటామని" మిల్లర్ అన్నారు. "ఐటీ శాఖ కాంగ్రెస్ పార్టీ ఖాతాలను స్తంభింపజేస్తుందని మా దృష్టికి వచ్చింది. దీనివల్ల రాబోయే ఎన్నికల్లో ప్రచారం చేయడం ఇబ్బందికరంగా మారిందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు కూడా మా దాకా వినవచ్చాయి. ఇందులోని ప్రతి అంశం గురించి పారదర్శకంగా, సకాలంలో నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి. అటువంటి చట్టపరమైన ప్రక్రియల వేగిరంలో మేము కృషి చేస్తామంటూ" మిల్లర్ ప్రకటించారు. మిల్లర్ వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ లోని అమెరికా దౌత్యవేత్త గ్లోరియా బార్బెనా కు భారత్ సమన్లు జారీ చేసింది. దీనిపై మిల్లర్ స్పందించారు. "ఇక్కడ నేను ప్రైవేట్ వ్యవహారాల గురించి మాట్లాడటం లేదు. ఆ దేశంలో జరుగుతున్న విషయాలను నేను ప్రస్తావించాను. చట్టపరమైన ప్రక్రియలను ప్రోత్సహించేందుకు మా వంతు సహాయం చేస్తామని చెబుతున్నామని" మిల్లర్ అన్నారు. మిల్లర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అమెరికా దౌత్యవేత్త ఎదుట భారత్ తన వాదన వినిపించింది. దీనికి సంబంధించి గంటకు పైగా సమావేశం జరిగింది. మరోవైపు అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై జర్మనీ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ని.. కొంతమంది మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. ఆయన సమాధానాలు చెప్పడానికి నిరాకరించారు.."అరెస్టుపై ఇప్పటికే మేము స్పందించాం. దీనికి సంబంధించి రెండు దేశాల మధ్య చర్చలు జరిగాయి. అయితే ఆ వివరాలు బయటకు చెప్పడం సాధ్యం కాదు. భారతదేశంలో రాజ్యాంగం ప్రకారం ప్రాథమిక హక్కులు అమలవుతున్నాయి. అక్కడ పౌరులకు స్వేచ్ఛ లభిస్తోంది. భారతదేశంలో మేము వ్యూహాత్మక వ్యాపార భాగస్వామిగా ఉన్నాం. భారతదేశం విలువలకు కట్టుబడి ఉంటుందని మేము నమ్ముతున్నామని" జర్మనీ విదేశాంగ ప్రతినిధి ప్రకటించారు. జర్మనీ విదేశాంగ ప్రతినిధి వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆ దేశ ఎంబసీ డిప్యూటీ చీఫ్ జార్జ్ ఎన్జ్విలర్ కు భారత ప్రభుత్వం సమన్లు జారీ చేసింది. విదేశాంగ ప్రతినిధి వ్యాఖ్యల పట్ల అభ్యంతరం వ్యక్తం చేసిందిఅటు అమెరికా, ఇటు జర్మనీ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ స్పందించింది. అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై రెండు దేశాల విదేశాంగ ప్రతినిధులు చేసిన వ్యాఖ్యల పట్ల భారత్ నిరసన వ్యక్తం చేసింది."ఒక దేశ దౌత్య నీతిలో మరో దేశం తలదూర్చడం సరికాదు. అంతర్గత వ్యవహారాలను కచ్చితంగా గౌరవించాలి. భారత్ ఒక ప్రజాస్వామ్య దేశం. కచ్చితంగా ఇక్కడ అన్ని హక్కులు అమలవుతుంటాయి. అనేక ప్రజాస్వామ్య ప్రక్రియలు కొనసాగుతుంటాయి. ఇక్కడి న్యాయ వ్యవస్థ కూడా చాలా దృఢమైనది.

# భాష్యం హైస్కూల్లో ఘనంగా కల్చరల్ డే వేడుకలు..



ఎమ్మిగనూరు ఏప్రిల్ 01 విభారె న్యూస్...పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో స్కూల్ డే వేడుకలు సీఈవో అనిల్ కుమార్ ఆదేశాలతో ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో కల్చరల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా బనవాసి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మావతి, ఏపీఆర్జేసీ ప్రిన్సిపాల్ డా" జయం శ్రీనివాస్ గుప్తా లు హాజరయ్యారు. ఏపీ గురుకుల జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయం శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, స్కూల్ యాజమాన్యం సమన్వయకర్తలుగా ఉంటారు ఇందులో ఉపాధ్యాయుని పాత్ర చాలా కీలకమైనది తల్లిదండ్రుల ఉపాధ్యాయులకు సహకరించాలని కోరారు. బనవాసి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ నేటి కాలంలో విద్యార్థులు సెల్ ఫోన్ లకు ఎక్కువ అడాప్ట్ కావడం చేత చదువుపై శ్రద్ధ తగ్గుతుందని తెలియజేశారు. ఎప్పుడైతే వీటి నుండి విద్యార్థులకు దూరం చేస్తామో విద్యార్థులు ఉన్నత శిఖరాల వైపుకు అడుగులు వేస్తారని తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులు మానసికంగా ఒత్తిడి నుండి దూరం చేయవచ్చు అని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించినందుకు భాష్యం యాజమాన్యాన్ని మెచ్చుకోవడం జరిగింది. భాష్యం హై స్కూల్ ప్రిన్సిపాల్ మాచాని కవిత మాట్లాడుతూ పాఠశాలలో జరిగే అకాడమిక్స్. ప్లానింగ్ ,ఆక్టివిటీస్ గురించి తెలియజేస్తూ భవిష్యత్తులో ఎదుర్కొనేటువంటి కాంపిటేటివ్ దిశా మాస్ ఒలంపియాడ్, దిశా సైన్స్ ఒలంపియాడ్ గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగింది. అంతేకాకుండా చదువుతోపాటు శారీరక మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రోజు యోగ తప్పనిసరి అని తెలిపారు. ఇందులో విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చాంప్స్ఇంచార్జ్ అనురాధ, ఉపాధ్యాయ బృందం పాల్గొనడం జరిగింది.

# డబ్బులు లేనందునే ఫించన్ల పంపిణీకి బ్రేక్..!

- ఉన్న సొమ్మును తమ కాంట్రాక్టర్లకు ధారాదత్తం
- నగదు ఉంటే సచివాలయ ఉద్యోగులతో పంచవచ్చు
- వాలంటీరు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు
- అధికారంలోకి రాగానే ఫించను సొమ్ము పెంపు



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :-ఏప్రిల్ 1 : ప్రభుత్వ ఖజానాలో డబ్బులు లేకపోవడం వల్లే నిరుపేదలకు ఇచ్చే పింఛను సొమ్ముకు బ్రేక్ పడిరదని డోన్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం బేతంచెర్ల స్థానిక పార్టీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ జగన్ చేతగాని తనంతో ఫించన్లను పంపిణీ చేయలేక ఆ నెపాన్ని ప్రతిపక్ష పార్టీలు, ఎన్నికల కమిషన్ మీద నెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖజానాలో ఉన్న సొమ్మును గత మార్చి 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సుమారు రూ.13వేల కోట్లకు పైగా తన అనునూయులైన కాంట్రాక్టర్లకు పంచిపెట్టారని ఆయన మండిపడ్డారు. ఈ సొమ్ము ఎన్నికల నియమావళికి విరుద్ధంగా కాంట్రాక్టర్లకు ఇచ్చి ఖజానా ఖాళీ చేసి నిరుపేదల ఆకలికి జగన్ కారణమయ్యారని ఆయన అన్నారు. ఈ సొమ్మును ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1.35లక్షల మంది సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి పింఛను పంపిణీ చేయవచ్చని కోట్ల సూర్య స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతో ముందుగానే తన అనునూయులకు నిధులు చెల్లించారని ఆయన విమర్శించారు. ప్రస్తుత ఫించన్ల సొమ్ము ఒక్కటే కాదని గత జనవరి 23న చెల్లించాల్సిన ఆసరా సొమ్ము, ఫిబ్రవరి 29న చెల్లించాల్సిన విద్యార్థుల విద్యా దీవెన సొమ్ము, మార్చి 14న చెల్లించాల్సిన ఈబీసి నేస్తం డబ్బులతో పాటు ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు ఇవ్వాల్సిన రూ.13వేల కోట్లకు పైగా నిధులను తన అనుకూల కాంట్రాక్టర్లకు చెల్లించారని కోట్ల ఆరోపించారు. దీని కారణంగా నిరుపేదలకు ఖజానా ఖాళీ అవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వద్ద నిధులు లేనందునే ఫించన్ల పంపిణీ ఆలస్యానికి కారణమని చెప్పడానికి సాక్ష్యం వైసిపి దిన పత్రిక సాక్షిలో మార్చి 28వ తేదీననే ఫించన్ల పంపిణీ ఏప్రిల్ 3వ తేదీ నుంచి పంపిణీ చేస్తామని ఎన్నికల కమిషన్ ఆదేశాలకు ముందే మార్చి 28వ తేదీనే ప్రచురించారని ఆయన పేర్కొన్నారు. తాను తప్పు చేసి ఆ తప్పును తెలుగుదేశం పార్టీపై నెట్టేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని కోట్ల అన్నారు. ప్రభుత్వం వ్యవహరించిన తీరు కారణంగా పేదల ఇబ్బందులను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, సెర్ప్ సిఇఒ మురళీధర్ రెడ్డిలపై ఫిర్యాదు చేస్తామని ఆయన అన్నారు. అధికారంలోకి రాగానే ఫించను సొమ్ము పెంపు: ఎన్నికల్లో తాము విజయం సాధించడం ఖాయమని ఆ తరువాత ఫించనుదారులకు నెలకు రూ.4వేల చొప్పున లబ్దిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయడం ఖాయమని ఆయన అన్నారు. అలాగే వాలంటీరు వ్యవస్థను తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకొని వారి పొట్ట కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన అనంతరం వాలంటీరు వ్యవస్థను ప్రజాసేవకు అనుకూలంగా పార్టీలకతీతంగా వారికి సేవలప్పగించి వారి జీవితాలను గాడిన పెట్టేందుకు ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.

# మానవ విలువలతోనే సమాజాభివృద్ధి సాధ్యం!



భీమవరం ఏప్రిల్ 01 మానవ విలువలతోనే సమాజ అభివృద్ధి వ్యక్తిగత సౌశీల్యం సాధ్యమని భీమవరం ఎస్ ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు ,ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణ రాజు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జీవన విద్య శిక్షణ శిబిరం కళాశాలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు శ్రేయోభిలాషులు కళాశాలలో పనిచేసే అధ్యాపక ,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణంరాజు ,డాక్టర్ జగపతి రాజులు మాట్లాడుతూ మానవ విలువలతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని . నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ లో కూడా హ్యూమన్ వాల్యూస్ యొక్క ప్రాముఖ్యతను గుర్తించి ఏఐసిటీ కూడా ఇంజనీరింగ్ సిలబస్ లో హ్యూమన్ వాల్యూస్ కోర్స్ ని సిలబస్ లో చేర్చడం జరిగింది అని తెలిపారు. మనిషి ఆనందంగా జీవించడానికి కావలసిన ముఖ్యమైన విషయాలను చాలా సులభంగా అర్థమయ్యే రీతిలో వక్తలు శివశంకర్, శ్రీదేవి, బాల రమేష్ వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి వ్యక్తిగత జీవితంలోను మనం దేని కొరకు పాటు పడుతున్నాము, ఎందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము, కుటుంబంలో అలాగే చుట్టూ ఉన్నవారితో సంబంధాలను మరింత అర్థం చేసుకుంటూ, ఆత్మీయంగా, అనందంగా జీవించడం ఎలాగా, అలాగే సమాజం లో మన భాగస్వామ్యులం అవడం, ప్రకృతి తో మమేకమై జీవించడం ఎలాగా అనే అనేక విషయాలు మనం తెలుసుకోలేక, అవగాహన లేక రోజు వారి జీవితం లో ఇబ్బంది పడుతున్నారన్నారు. జీవితాన్ని ఆనందంతో జీవించడం మంచిని ప్రేమించటం ప్రతి వ్యక్తి తన మనసులో అటువంటి భావాలను నిక్షిప్తం చేసుకుంటే దీనిని నేను అధిగమించవచ్చునని పేర్కొన్నారు . సంస్థ నుంచి వచ్చిన వక్తలు సోదహరనంతో వివరించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరు జీవితమం లో ఇన్ని సంవత్సరాలు ఇలాంటి విద్య పూర్తిగా అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, దీనిని ఆచరించడం వలన కొంత ఆనందంగా జీవించే అవకాసం వుంది అనే స్పష్టత వచ్చిందని పేర్కొన్నారు. ఈ శిభిరం సెంటర్ ఫర్ హోలీస్టిక్ డెవలప్మెంట్ హ్యూమన్ కాన్షియస్నెస్ సంస్థ సహకారంతో కార్యక్రమం నిర్వహించడం జరిగిందని కోఆర్డినేటర్ ఇంజనీరింగ్ కెమిస్ట్రీ హెడ్ డాక్టర్ పి భవాని పి రమేష్ రాజు చెప్పారు.

# ఆ రాక్షసుడిని రాష్ట్రం నుంచి తరిమికొడదాం



పెంటపాడు, ఏప్రిల్ 01 పశ్చిమగోదావరి జిల్లా రాక్షసుడు పాలనలో రాష్ట్రం విచ్ఛిన్నమైందని కనీసం రాజధాని కూడాలేనిరాష్ట్రంగావిచ్ఛిన్నంచేసిన జగన్‌నుతరిమికొడదామనికూటమిఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పెంటపాడు లో పల్లెపోరు భాగంగా శనివారం రెండో రోజు ఇంటింటికి సమస్యలు అదిగి తెలుసుకుంటూ ముందుకుకదిలారు. ఈ సందర్భంగాస్థానికులు రోడ్డులేకతాము ఇబ్బంది పడుతున్నామని మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలో వచ్చిన వెను వెంటనే రోడ్లన్నీ సుభిక్షం చేస్తామని హామీ ఇచ్చారు. జగన్ పాలనలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు నిర్వీర్యం చేసి వారి ఎదుగుదలను అడ్డుకున్నాడని, ఎస్సీలపైవారినాయకులే దాడులు చేసి చంపేసిన ఘటనలుగా ఉన్నాయని వివరించారు. తనపై చేస్తున్న అవినీతి ఆరోపణలకు బొలిశెట్టి ఘాటుగా స్పందించారు. అవినీతి విషయంలో నువ్వు కుల దైవంగా భావించే పట్టంపాడులోనే ఇద్దరంప్రమాణంచేద్దామనినువ్వుఅవినీతిచక్రవర్తివనినాపైఅబాండాలు వేయడం మనీ నీ పాపం సూచించారు.

# మలుపులు తిరుగుతున్న వలంటీర్ల వ్యవహారం

విజయవాడ, ఏప్రిల్ 1 ఆంధ్రప్రదేశ్‌లో వాలంటీర్ల వ్యవస్థ పై ప్రతిపక్షాలు సందేహాలు వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. ప్రభుత్వ ధనం ఖర్చు చేస్తూ పార్టీ కార్యక్రమాలకు వాడుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో వీరిని దూరంగా ఉంచాలనే వరకు పరిస్థితి వెళ్ళింది. ఫిర్యాదుల పరిశీలన నేపథ్యంలో.. ఎన్నికల సంఘం కూడా తీవ్రంగానే స్పందించింది. ఎన్నికల వేళ వాలంటీర్లను దూరంగా ఉంచాలని ఆదేశించింది. ఇదే విషయంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి కూడా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఇది పరిపాలన వ్యవహారమే. దీంతో ఎన్నికల్లో గ్రామ సచివాలయ వాలంటీర్లు సేవలు అందించేందుకు అవకాశం లేకుండా పోయింది. తాజాగా ఎన్నికల సంఘం వారికి ఇచ్చిన ఫోన్‌లు, ట్యాబ్‌లు కూడా ఇచ్చేయాలని ఆదేశించింది. దీంతో వారితో రాజీనామాలు చేయించి.. ఎన్నికలకు వాడుకోవాలని వైసీపీ తమ ఎమ్మెల్యే అభ్యర్థులకు సూచనలు పంపింది. వైసీపీ వాలంటీర్లను ఎన్నికలకు ఉపయోగించుకునేందుకు ఆటంకాలు ఏర్పడుతూంటంతో గ్రామ సచివాలయ వాలంటీర్లను వ్యూహాత్మకంగా రాజీనామాల బాట పట్టిస్తున్నారు. ఇంకొన్ని చోట్ల ఒత్తిళ్లు తట్టుకోలేక కొందరు వాలంటీర్లు రాజీనామాలకు సంసిద్ధమయ్యారు. అధికారంలోకి రాగానే సీఎం హోదాలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. 2019 అక్టోబర్ 2వతేదీన వార్డు సచివాలయాలకు శ్రీకారం చుట్టారు. అన్ని లాంఛనాలను పూర్తి చేసిన తర్వాత 2021 అక్టోబర్‌లో 15,004 గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. అలాగే రాష్ట్రంలో 16 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 32 నగర పంచాయతీలు ఉన్నాయి. వీటన్నిటి పరిధిలో ఇంటి ముంగిటకే పరిపాలన తీసుకువచ్చింది. అన్ని విభాగాలు అందుబాటులో ఉండే విధంగా రాష్ట్రంలో 1,26,649 నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించి ప్రజలకు అందుబాటులో ఉంచారు. రాష్ట్రంలో 3.2 కోట్ల మందికి ప్రభుత్వ పథకాలు అందించడానికి వీలుగా 50 ఇండ్లకు ఒకరిని కేటాయిస్తూ రూ.5 వేల గౌరవ వేతనంతో పనిచేయడానికి 2,54,832 వాలంటీర్లు నియమితులయ్యారు.గ్రామ సచివాలయల ద్వారా ప్రజలకు పథకాలు, అందుతున్నాయి. చాలాచోట్ల చోటుచేసుకుంటున్న పరిణామాలపై ప్రతిపక్షాలు మండిపడుతూనే ఉన్నాయి. వాలంటీర్లను అడ్డుపెట్టుకుని ఇతరత్రా కార్యక్రమాలు సాగిస్తున్నారంటూ ప్రతిపక్షాలు ఘాటుగా విమర్శిస్తున్నాయి. వాలంటీర్లు ప్రభుత్వ పథకాలను పంపిణీ చేయడమే కాకుండా, పార్టీకి ప్రచారం చేస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వారు ఆ సమాచారాన్ని దుర్వినియోగం చేస్తూండటంతో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. "మా ప్రభుత్వం వస్తే వాలంటీర్లను తొలగించం. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే ఉపేక్షించే సమస్యే లేదని విపక్ష నేతలు వాలంటీర్లను హెచ్చరించారు. తాము అధికారులకు వచ్చిన తర్వాత ఐదు వేల గౌరవ వేతనాన్ని రూ.50 వేలు సంపాదించుకునే రీతిలో స్కిల్ డెవలప్మెంట్ ఇప్పిస్తాం" అని చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఎన్నికల కమిషన్ ఆంక్షలతో .. వైఎస్ఆర్సిపి నాయకుల్లో కొత్త ఆలోచనకు తెర తీసింది. ఎలాగో మళ్లీ తమ ప్రభుత్వమే వస్తుందని ధీమాతో వైఎస్సార్సీపీ నాయకులు ఉన్నారు. ఆ ధైర్యంతోనే గ్రామాల్లో ఉన్న వార్డు సచివాలయ వాలంటీర్లతో రాజీనామాలు చేయిస్తున్నట్లు పరిస్థితి చెప్పకనే చెబుతోంది. వార్డు ఏజెంట్లుగా కూర్చుంటారని ప్రకటించారు. కొన్ని చోట్ల వాలంటీర్లు రాజీనామాలు చేయడానికి నిరాకరిస్తే.. వారితో బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వాలంటీర్లు రాజీనామా చేసి రావాలని ఒత్తిడి చేస్తున్నారు. మళ్లీ వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వస్తుంది, మళ్లీ మిమ్మల్ని తీసుకుంటాం అని భరోసా ఇస్తున్నారు. ఒక్క సారి రాజీనామా చేశారు అంటే.. ఇక వాలంటీర్ కానట్లే. వైసీపీకి పని చేసుకోవచ్చు.. చేయకపోవచ్చు.. ప్రభుత్వం వస్తే మళ్లీ వారికి వాలంటీర్ పోస్ట్ ఇస్తారు. మరి ప్రభుత్వం మారితే. ఏదీ రాదు. ఉన్న అవకాశం పోయినట్లవుతుంది. ఎందుకంటే ఉన్న వాలంటీర్ల సంక్షేమం చూసుకుంటానని చంద్రబాబు చెబుతున్నారు. రాజీనామాలు చేసి..వైసీపీ కోసం పని చేసిన వారి గురించి పట్టించుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉండదు. పైగా.. చేసినతప్పులకు కేసులు పెట్టినా ఆశ్చర్యం ఉండదు.

# అందుబాటులోకి ఈసీ సువిధ యాప్

విజయవాడ, ఏప్రిల్ 1, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారం కోసం అధికారుల నుంచి వేగంగా, ఎటువంటి వ్యయ ప్రయాసలు లేకుండా అనుమతులు పొందేందుకు భారత ఎన్నికల సంఘం సువిధ సింగిల్ విండో యాప్‌ను ప్రవేశపెట్టింది. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ర్యాలీలు, ఊరేగింపులు వంటివి నిర్వహించే పలు రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల సంఘం అనుమతిని తీసుకునేందుకు సువిధ యాప్?ను వినియోగించుకోవచ్చు. అభ్యర్థులు 48 గంటలకు ముందు దరఖాస్తులు చేసుకుంటే, 24 గంటల్లోనే అధికారులు అనుమతులు జారీ చేస్తారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న పార్టీల నుండి పోటీ చేసే అభ్యర్థులు అనుమతుల కోసం సువిధ యాప్ సింగిల్ విండో పద్దతిలో దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో గానేఅనుమతులను అధికారులు మంజూరు చేస్తున్నారు.ఏపీలో ఇప్పుడు ఎక్కడ చూసినా ఎన్నికల ప్రచార వేడి కనిపిస్తుంది. పోలింగ్?కి ఇంకా 40 రోజులుపైనే టైం ఉన్నపటికీ అభ్యర్థులు మాత్రం ప్రచారంలో తగ్గేదెలే అన్నట్లు ప్రచారంలో దూసుకుపోతున్నారు. అయితే ప్రచారంలో ఇప్పటి వరకు ఒక ఎత్తు.. ఎన్నికలకు ముందు మరో ఎత్తు అనేలా ఎన్నికల కమిషన్ ప్రచారంలో తొలిసారిగా ఆంక్షలు పెట్టింది. ప్రచారాలకు సంబంధించి సమాచారం ముందుగా ఇవ్వాలని కొత్త యాప్ రూపొందించింది. ఏ పార్టీకి చెందిన అభ్యర్థులైనా ప్రచారాలకు సంబంధించి 48 గంటల ముందు సువిధ అనే యాప్?లో అప్లై చేసుకోవాలి. ఇలా అప్లై చేసుకున్న 24 గంటల్లోనే అనుమతి వస్తుంది.మీటింగ్, ర్యాలీలు, వాహనాలు, తాత్కాలిక ఎలక్షన్ ఆఫీస్, లౌడ్ స్పీకర్, హెలికాప్టర్, హెలిప్యాడ్, డోర్ టు డోర్ ప్రచారం, డిస్ ప్లే బ్యానర్స్, ఫ్లాగ్స్, ఎయిర్ బెలూన్స్, హోర్డింగులు, బ్యానర్లు, వీడియో వ్యాన్ మొదలైన అనుమతులు పొందేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులభతరంగా సువిధ పోర్టల్?లో దరఖాస్తు చేసుకునేలా ఇచ్చే ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది. అలాగే అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయాల వద్దనే అనుమతి తీసుకునేందుకు వీలుగా కూడా సువిధ కౌంటర్?ను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ప్రచార అనుమతుల కోసం సువిధ ఆన్లైన్ పోర్టల్?లో దరఖాస్తులు చేసుకుని వేగంగా అనుమతులు పొంది, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో అన్ని విధాల జిల్లా యంత్రాంగానికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు

# గంటా విజయం సాధిస్తారా...

విశాఖపట్టణం, ఏప్రిల్ 1, గంటా శ్రీనివాసరావు రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఒక్క సారి కూడా ఓడిపోలేదు. అలాగని ఆయన రెండో సారి తాను గెలిచిన నియోజకవర్గంలో పోటీ చేయలేదు. తొలి సారి సెంటిమెంట్ బ్రేక్ చేశారు. గతంలో గెలిచిన భీమిలీ నుంచి మరోసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా దాదాపు రెండున్నర దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న నేత గంటా శ్రీనివాసరావు. 1999లో తెలుగుదేశం పార్టీలో చేరి తొలిత అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. అనంతరం 2004 లో చోడవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. అప్పట్లోనే



ప్రజారాజ్యం పార్టీ రావడంతో ఆ పార్టీలో చేరారు. 2009లో పీఆర్పీ నుంచి అనకాపల్లి ఎమ్మెల్యేగా పోటీ చేసి మళ్లీ గెలుపొందారు. ఇక్కడ ఆయనకు మరో అంశం కలిసొచ్చింది. పీఆర్పీ.. కాంగ్రెస్‌లో విలీనం కావడంతో పీఆర్పీ కోటాలో రాష్ట్ర మంత్రి అయిపోయారు. రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ ఉనికిని కోల్పోవడంతో గంటా తిరిగి సొంత గూటికి చేరారు. టీడీపీ తరఫున భీమిలి టికెట్ సాధించి 2014లో మళ్లీ ఎమ్మెల్యే అయిపోయారు. అంతే కాకుండా చంద్రబాబు మంత్రివర్గంలో చోటు కూడా సంపాదించారు. తిరిగి 2019 ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే అప్పుడు టీడీపీ అధికారంలో లేనందున ఎమ్మెల్యేగానే ఉండిపోయారు.ఈ సారి ఆయన గత ఎన్నికల్లో గెలిచిన విశాఖ నార్త్ నుంచి పోటీ చేయదల్చుకోలేదు. మరో నియోజకవర్గంపై దృష్టి పెట్టారు. అయన కోరిక తీర్చేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గంలో బొత్స సత్యనారాయణపై పోటీ చేయాలని సూచించారు. కానీ గంటా మాత్రం.. సెంటిమెంట్ బ్రేక్ చేయడానికి సిద్ధమయ్యారు. భీమిలీ కా?లని పట్టుబట్టారు. అదే నియోజకవర్గం ఖరారైంది. సెంటిమెంట్‌కు విరుద్ధంగా గంటా శ్రీనివాస్ ఈసారి పోటీకి దిగారు. పోటీ చేసిన నియోజకవర్గంలో తిరిగి పోటీ చేయని గంటా శ్రీనివాసరావు గతంలో ఎమ్మెల్యేగా గెలిచిన భీమిలి నియోజకవర్గంలోనే రెండోసారి పోటీ చేస్తున్నారు. ఎన్నికల మేనేజ్మెంట్‌లో చాణక్యుడైన గంటా శ్రీనివాస్ రెండోసారి నెగ్గుకోస్తారా.... అన్నదే ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.గంటా శ్రీనివాసరావు భీమిలీలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అక్కడ మంచి ఫలితాలు సాధించింది. గట్టి క్యాడర్ ఉంది. గంటా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించే వారు లేరు. అదే సమయంలో జనసేన తో పొత్తు కలసి వస్తుంది. టీడీపీ, జనసేన కలిస్తే భీమిలీలో ఏకపక్ష ఎన్నిక జరుగుతుందన్న అభిప్రాయం ఉంది. అందుకే ఈ సారి సెంటిమెంట్ బ్రేక్ చేసినా గెలుపు దగ్గరకే వెళ్తానని గంటా గట్టి నమ్మకంతో ఉన్నారు.

# కన్నీరు పెట్టిస్తున్న స్టూడెంట్ లెటర్

విశాఖపట్టణం, ఏప్రిల్ 1 లైంగిక వేధింపులు అధికం కావడంతో కుటుంబం పరువు పోతోందన్న భయంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. విశాఖపట్నంలో ఈ దారుణం చోటుచేసుకుంది. ఇప్పటి వరకు టెన్షన్ పెట్టినందుకు క్షమించండి అక్కా, మీ పరువు తీస్తు?న్నందుకు సారీ నాన్నా అంటూ ఆమె రాసిన చివరి మాటలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. విద్యార్థులతో కలిసి ఫ్యాకల్టీ సైతం తనపై లైంగిక వేధింపులకు పాల్పడటం, బలవంతంగా తీసిన అసభ్యకర వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నారని.. తన చావుతోనైనా ఇతర విద్యార్థినులకు న్యాయం జరగాలని ఆ విద్యార్థిని కోరుకుందంటే అక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.క్షమించండి అక్కా, ఇప్పటి వరకు టెన్షన్ పెట్టినందుకు. అయితే నేను వెళ్ళాలి. ఏది ఏమైనా నీకు, బావ కి అభినందనలు. ఒక ఆరోగ్యకరమైన బిడ్డకి జన్మనివ్వు అది చాలు. హాయ్ అమ్మా , నాన్, అక్కా, చెల్లి మరియు కుటుంబం మొత్తానికి. నేను ఎందుకు వెళ్లిపోతున్నానో చెప్పలేను. చెప్పిన మీకు అర్థం కాదు. ఇంకా నా గురించి మార్చిపోండి. నన్ను క్షమించండి. ఇప్పటి వరకు నన్ను కానీ పెంచినందుకు అమ్మనాన్నలకు చాలా చాలా థ్యాంక్స్. ఐ మిస్ యూ సో మచ్... ఇంకా నా చాప్టర్ ఎండ్ అయిపోయింది. మిమ్మల్ని చాలా ఇబ్బంది పెట్టాను కదా ఇంకా పెట్టనులే నాన్న. నేను ఉంటే ఇంకా చాలా సమస్యలు వస్తాయి. అందుకే వెళ్లిపోతున్నా.. అమ్మ, నాన్న ఆరోగ్యం జాగ్రత్త.అక్కా, బావ ఇద్దరికీ అభినందనలు. దివ్య ఐ రియల్లీ మిస్ యూ సో మచ్. నీ ఫ్యూచర్ పైనా ఫోకస్ పెట్టు. స్టడీ లో నీకు ఏది ఇష్టం అయితే అది చదువు. పక్కవాళ్లు చెప్పారు అని నీ ఇష్టాన్ని వదులుకోవద్దు. మీరు ఎల్లప్పుడూ సంతోషంగా ఉండండి. గుడ్ బై మీ అందరికీ నేను మిమ్మల్ని చాలా మిస్ అవుతున్నాను. నేను ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నాను అంటే.. ఇప్పుడు నేను చనిపోతే మీరు కొంతకాలం బాధపడి తరువాత నన్ను మరిచిపోతారు. నీ కూతురిగా పుట్టినందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను. కానీ నీ పరువు తీసేస్తున్నందుకు నన్ను క్షమించండి నాన్నా' అని చివరగా విద్యార్థిని మెస్సేజ్ పెట్టి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోందిఈ కాలేజీలో లైంగిక వేధింపులు జరుగుతున్నాయి నాన్నా.

మరి ఫ్యాకల్టీకి చెప్పొచ్చు కదా అని మీరు అనుకోవచ్చు. కానీ వేధింపులకు పాల్పడుతున్న వారిలో ఫ్యాకల్టీ ఉన్నారు. అసభ్యకరంగా ఫొటోలు తీసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. విద్యార్థులకు చెప్పాల్సింది పోయి ఫ్యాకల్టీ సైతం నాతో పాటు చాలా మంది విద్యార్థినులపై వేధింపులకు పాల్పడుతున్నారు. ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరిస్తున్నారు. ఎవరికి చెప్పుకోలేక... అలా అని కాలేజీకి వెళ్లలేక మధ్యలో నలిగిపోతున్నాం నాన్న. పోలీసులకు ఫిర్యాదు చేస్తే సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు అప్ లోడ్ చేస్తామని బెదిరించారు. ఎవరో ఒకరు చస్తేనే కానీ ఈ విషయం, మా భయం ప్రపంచానికి తెలుస్తుంది. అందుకే ఆ పని నేనే చేస్తున్నా నాన్నా.. నన్ను క్షమించండి నాన్నా. ఇప్పుడు నేను చనిపోతే మీరు కొంతకాలం బాధపడి తరువాత నన్ను మరిచిపోతారు' అంటూ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థిని మెస్సేజ్ చేసి ఆత్మహత్య చేసుకుంది. కాలేజీ బిల్డింగ్ మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం చెప్పకుండా.. మీ అమ్మాయి కనిపించడం లేదంటూ కాలేజీ నుంచి ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందినట్లు చెప్పి కన్నీటి పర్యంతమవుతున్నారు. తన కూతురి మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు విద్యార్థిని తండ్రి ఫిర్యాదుచేశారు

# ఐదోసారి గెలుపు కోసం....



## కొడాలి నాని ప్రయత్నాలు

విజయవాడ, ఏప్రిల్ 1 క్రిష్ణా జిల్లా మచిలీపట్న పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని గుడివాడ అసెంబ్లీ ఎంతో కీలకమైన నియోజకవర్గం. తెలుగువాడి కీర్తి ప్రపంచం నలుమూలలా చాటి చెప్పిన అన్న నందమూరి తారక రామారావు ను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టిన నియోజకవర్గం. కమ్యూనిస్టుల ఖాతాలో ఉన్న ఈ నియోజకవర్గంపై తొలుత కాంగ్రెస్ పాగా వేయగా...తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత ఆ పార్టీకి కంచుకోటగా మారింది. గత రెండు దఫాలుగా వైసీపీ గెలుస్తూ వస్తోంది.రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ ముఖ్యంగా తెలుగుదేశం అభిమానులు ఎదురుచూస్తున్న మరో ఫలితం గుడివాడ. తెలుగుదేశానికి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో ఆ పార్టీ నుంచి వెళ్లి వైసీపీలో చేరిన కొడాలి నాని వరుసగా రెండుసార్లు గెలిచారు. చంద్రబాబుపై వ్యక్తిగత దూషణలకు దిగే...కొడాలినానిని ఈసారి గుడివాడలో ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని తెలుగుదేశం నాలుగేళ్ల క్రితమే ప్రణాళికలు రచించింది...గెలుపు గుర్రాన్ని సిద్ధం చేసింది. అసలు నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇక్కడ ఎవరెవరు గెలిచారో ఒకసారి చూద్దాం..1952లో ఏర్పడిన గుడివాడ నియోజకవర్గంలో తొలుత కమ్యూనిస్టుల ప్రభావం ఉండేది. తొలిసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిపై సీపీఐ అభ్యర్థి గుంజి రామారావు విజయం సాధించారు. ఏడాదికే జరిగిన ఉప ఎన్నికల్లో సీపీఐ నుంచి కాట్రగడ్డ రాజగోపాల్రావు గెలుపొందారు. 1955లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుచి వేముల కూర్మయ్య విజయం సాధించారు. 1962లో జరిగిన ఎన్నికల్లో మరోసారి సీపీఐ నుంచి గుంజి రామారావు జయకేతనం ఎగురవేశారు. 1967లోజరిగిన ఎన్నికల్లో ఎం.కె. దేవి కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. 1972లో జరిగిన ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి వెంకట సుబ్బారావుపై కాంగ్రెస్ పార్టీకి చెందిన కఠారి సత్యనారాయణరావు విజయం సాధించారు. 1978లోనూ మళ్లీ వీరివురు పోటీపడగా...మళ్లీ కఠారినే గెలుపొందారు. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత తన సొంత నియోజకవర్గామైన గుడివాడ నుంచి నందమూరి తారకరామారావు భారీ మెజార్టీతో విజయం సాధించారు.1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో గుడివాడ నుంచి మరోసారి ఎన్టీఆర్ పోటీ చేయగా...ఆయనపై కాంగ్రెస్ అభ్యర్థి ఉప్పలపాటి సూర్యనారాయణబాబు నిల్చున్నారు. రెండోసారి గుడివాడ నుంచి ఎన్టీఆర్ విజయం సాధిచారు. ఎన్టీఆరో రెండుచోట్ల నుంచి విజయం సాధించడంతో గుడివాడలో రాజీనామా చేయగా...రావిశోభనాద్రి చౌదరి తెలుగుదేశం నుంచి గెలుపొందారు. 1989లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి రావి శోభనాద్రిచౌదరిపై కాంగ్రెస్ అభ్యర్థి కఠారి ఈశ్వర్‌కుమార్ కేవలం 500 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.1994లో జరిగిన ఎన్నికల్లో మరోసారి వీరిద్దరే పోటీపడగా..ఈసారి తెలుగుదేశం అభ్యర్థి రావి శోభనాద్రి చౌదరి గెలుపొందారు.1999లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి రావి హరిగోపాల్ పోటీచేయగా...కాంగ్రెస్ నుంచి శేగు వెంకటేశ్వర్లుపోటీలో నిల్చున్నారు. మరోసారి తెలుగుదేశాన్ని విజయం వరించింది. రోడ్డు ప్రమాదంలో హరిగోపాల్ మృతిచెందగా ఉపఎన్నికల్లో ఆయన సోదరుడు రావి వెంకటేశ్వరరావు( విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి కొడాలి నాని కాంగ్రెస్ నుంచి కఠారి ఈశ్వర్‌కుమార్ పోటీ చేయగా...నాని విజయం సాధించారు.2009లోనూ గుడివాడ నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా కొడాలి నాని కాంగ్రెస్ అభ్యర్థి పిన్నమనేని వెంకటేశ్వరరావుపై గెలుపొందారు. ఆ తర్వాత కొడాలి నాని వైసీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో గుడివాడ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి రావివెంకటేశ్వర్రావుపై విజయం సాధించారు. గత ఎన్నికల్లో మరోసారి వైసీపీ తరఫున కొడాలినాని పోటీ చేయగా...తెలుగుదేశం నుంచి దేవినేని అవినాష్(పోటీపడ్డారు. వరసగా నాల్గవసారి కొడాలి నాని గెలుపొందారు. జగన్ ప్రభుత్వంలో ఆయన మంత్రిగానూ పనిచేశారు. ప్రస్తుతం గుడివాడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా వైసీపీ తరఫున పోటీకి సిద్ధం కాగా...తెలుగుదేశం పార్టీ ఎన్నారై వెనిగండ్ల రాముకు టిక్కెట్ ఇచ్చింది. ఈసారి గుడివాడలో పోటీ నువ్వా-నేనా అన్నట్లు ఉంది.

# బద్వేల్ అసెంబ్లీ లో పొలిటికల్ హీట్

**నువ్వా నేనా అనే విధంగా కూటమి అభ్యర్థి రోశయ్య**

**వైకాపా అభ్యర్థి డాక్టర్ సుధా**

**ఇంకా ప్రకటించని కాంగ్రెస్ అభ్యర్థి**

**కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత మరింత హీట్**

బద్వేలు బద్వేలు అసెంబ్లీలో పొలిటికల్ హీట్ పెరిగింది నువ్వా నేనా అనే విధంగా కూటమి అభ్యర్థి బొజ్జ రోశయ్య వైకాపా అభ్యర్థి డాక్టర్ సుధా పోటీ పడుతున్నారు. ఇంకా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరనేది స్పష్టం కావడం లేదు.కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే కమలమ్మ పార్టీ అధికార ప్రతినిధి విజయ జ్యోతి పోటీ పడుతున్నారు. ఇతర పార్టీల తరఫున పలువురు ఎమ్మెల్యే బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రధాన పోటీ మాత్రం కూటమి అభ్యర్థి వైకాపా అభ్యర్థి మధ్య ఉంటుంది. ప్రధాన విషయం ఏమంటే మొట్టమొదటిసారి తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో లేకుండా పోయింది. మొన్నటి వరకు తెలుగుదేశం పార్టీ బాగా ప్రచారం చేసింది. కానీ పొత్తుల్లో భాగంగా బద్వేల్ అసెంబ్లీ బిజెపికి కేటాయించడంతో తప్పని సరి పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బొజ్జ రోశయ్య బిజెపిలో చేరారు. ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన రెండు రోజులకే ఆయనను పార్టీ అభ్యర్థిగా బిజెపి ప్రకటించింది. దీంతో బొజ్జ రోశయ్యకు తెలుగుదేశం జనసేన బిజెపి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. గత ఆరు నెలలుగా బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆమె కుమారుడు పార్టీ యువ నేత రితేష్ కుమార్ రెడ్డి విస్తృతంగా ప్రచారం చేశారు. అంతేగాక యువ నేత తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ఏడు మండలాల్లో 310 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేశారు. పాదయాత్రకు ప్రజల నుండి ఊహించని విధంగా స్పందన వచ్చింది అప్పట్లో టిడిపి ఇన్చార్జిగా బొజ్జ రోశయ్య ఉన్నారు. ఆయన కూడా పాదయాత్రలో పాల్గొన్నారు. అలాగే పాదయాత్రకు స్పందించిన ఎంతోమంది రాజకీయాలకు అతీతంగా తెలుగుదేశం పార్టీ నాయకులతో చేతులు కలిపారు. పలు మండలాల్లో వైసీపీకి చెందిన నాయకులు కార్యకర్తలు వందల సంఖ్యలో ఆ పార్టీని విడిచిపెట్టి తెలుగుదేశం పార్టీలో చేరారు. తెలుగుదేశం పార్టీలో చేరిన వారిలో మాజీ మండల అధ్యక్షులు ప్రస్తుత మండల అధ్యక్షులు మాజీ జెడ్పిటిసిలు సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు మాజీ ఎంపీటీసీ సభ్యులు మాజీ సర్పంచులు ఉన్నారు. తెలుగుదేశం జనసేన బిజెపి పొత్తులు కుదిరిన తర్వాత కడప జిల్లాలో బద్వేలు జమ్మలమడుగు అసెంబ్లీ స్థానాలు బిజెపికి కేటాయించారు. దీంతో తెలుగుదేశం పార్టీలో అలజడి మొదలైంది. దాదాపు పది రోజుల పాటు బద్వేల్ లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఎటువంటి ప్రచారం చేయలేదు. నాయకులు కార్యకర్తలు సైలెంట్ గా ఉండిపోయారు. ఆ తరువాత బొజ్జ రోశయ్య బిజెపిలో చేరడం వెంటనే పార్టీ అభ్యర్థిగా ఆయననే ప్రకటించడం చకచక జరిగిపోయాయి అలాగే జమ్మలమడుగు టిడిపి ఇన్చార్జి భూపేష్ రెడ్డిని కడప పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అధిష్టానం రెండు రోజుల క్రితం ప్రకటించింది.

# అసంతృప్తివాదులను కలుపుకుని పోతా

విజయవాడ ,విజయవాడ పశ్చిమ నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి భవానిపురం లోని పార్టీ కార్యాలయానికి వచ్చారు.. సుజనా చౌదరి మాట్లాడుతూ విజయ వాడ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా బిజెపి తరఫున పోటీ చేసే అవకాశం రావడం ఎంతో సంతోషం. ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండాలని ఎప్పటి నుంచో కోరిక ఉండేది. ఆ కోరిక ఇప్పుడు నెరవేర పోతుందని ఎంతో సంతోషంగా ఉంది. చంద్ర బాబు 2 సార్లు నన్ను రాజ్యసభ సభ్యులుగా చేశారు. కేంద్ర రాజకీయాలు అవగాహన పెంచుకున్నా. పశ్చిమ ఇవ్వడం ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యక్షంగా పాల్గొని ప్రజలకు సేవ చేసే అవకాశం కలిగింది.నియోజక వర్గంలో అనేక అభివృద్ధి పనులు చేయడానికి అవకాశం లభించింది. ప్రజలకు మేలైన సేవలు ఇవ్వడానికి కృషి చేస్తా...ఆ , నమ్మకం నాకు ఉంది.

## బీజేపీ పార్లమెంట్ కో ఆర్డినేటర్ గా అభిరుచి మధు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 01 – నంద్యాల జిల్లా బీజేపీ పార్లమెంట్ కో ఆర్డినేటర్ గా అభిరుచి మధు ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ గా కొనసాగుతున్నారు. అదనంగా ఆయనకు అధిష్ఠానం అదనపు భాధ్యతలు అప్పగించింది. అభిరుచి మధు మాట్లాడుతూ. కూటమి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందీశ్వరికి వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నంద్యాల జిల్లాలో అన్ని స్థానాల్లో కూటమి జెండా ఎగరవేయడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు.

## శానిటేషన్ పనుల పరిశీలన



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 01-పట్టణంలో శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి సోమవారంఎస్‌బీఐ కాలనీ. పొన్నాపురం వార్డు యందు పనులను పరిశీలించారు. అనంతరంపారిశుధ్య పనుల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు శానిటేషన్ వర్కర్స్ కు తగు సూచనలు చేశారుకమిషనర్ వెంట . శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## వాలంటరీ వ్యవస్థ పై కక్షగట్టిన చంద్ర బాబు : ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 01-పెన్షన్ ను ఇంటి వద్దకు అందించే వాలంటరీ వ్యవస్థ పై కక్ష గట్టిన చంద్రబాబు నాయుడు కు, టీడీపీ నాయకులకు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 6వ వార్డు పరిధిలో వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో ఈ వార్డులో ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు అందించిన సంక్షేమం అభివృద్ధి గురించి వివరించారు . అడుగడుగునా నీరాజనాలు పలుకుతూ సంప్రదాయ పద్ధతిలో హారతులతో స్వాగతాలు పలుకుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు కౌన్సిలర్ పురందర్ కుమార్ మాజీ కౌన్సిలర్ భీమనపల్లి వెంకటసుబ్బయ్య.... పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ప్రతి కార్మికుడు కష్టపడాలి

### ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు బతకన్న



కర్నూల్,ఏప్రిల్ 1:రానున్న సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్క కార్మికులు కష్టపడాలని ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బతకన్న పిలుపునిచ్చారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కే బాబురావు ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకన్న మాట్లాడుతూ రానున్న రోజులు చాలా విలువైనవి అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్న, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలు కావాలన్నా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందన్నారు. అందుకే ఇండియా కూటమి గెలుపు కోసం ఐ ఎన్ టి యు సి ఉన్నందు పోరాడుతుందన్నారు. వచ్చే నెల మే ఒకటో తారీకు మేడే పండుగ ను కార్మికుల మందిరం కలిసి ఘనంగా జరుపుకోవాలన్నారు.ఐ ఎన్ టి యు సి ఉపాధ్యక్షుడు కన్నయ్య మాట్లాడుతూ మన సంఘాలన్నీ ఐకమత్తంతోనే ఉండాలని కోరారు. కర్నూల్ నియోజకవర్గం ఇన్చార్జి ఐఎన్టిసి అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ మేడే మనమందరము ఘనంగా జరుపుకోవాలని కోరాడు. కోడుమూరు ఇన్చార్జి ప్రతాప్ మాట్లాడుతూ కోడుమూరులో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టు ఎవరికీ ఇచ్చినా కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని తీరుతామని అన్నారు .సమన్వయ కమిటీ అధ్యక్షుడు అనంతరత్నం మాట్లాడుతూ ఐఎన్టియుసి కాంగ్రెస్ పార్టీకి ఒక అనుబంధ సంస్థ అన్నాడు .ఈ సమావేశానికి కే ఆనందం, ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి కే మహేష్, ఐఎన్టీయూసీ సెక్రెటరీ భవన కార్మికుల అధ్యక్షుడు బి హుస్సేన్ ఫోటో స్టూడియో అధ్యక్షుడు ఆర్ రాముడు భవన కార్మికుల ఉపాధ్యాయుడు దేవరాజు,భవన కార్మిక నాయకుడు పాణ్యం నియోజకవర్గ ఇన్చార్జి సాంబ ,పేపర్ మిల్లు కార్మికులు ఇంకా అనేక మంది కార్మికులు హాజరైయారు.

## ఎన్నికల నియమావళి పై అవగాహన కల్పించండి:ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 01-ఎన్నికల నియమావళి పై వ్యాపారస్తులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి అధికారులను కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్, ఎస్పీ మరియు ఇతర ఉన్నత అధికారులను కలిసి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పై వ్యాపారస్తులకు అవగాహన కల్పించేందుకు సదస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యావత్ భారత దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు వాటిని పాటించాలని అది తప్పనిసరి అన్నారు. అయితే మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ లో ఉన్న అంశాల పై వ్యాపారస్తులకు సరైన అవగాహన లేకపోవడం ద్వారా గత కొన్ని రోజులుగా వ్యాపారస్తులలో ఆందోళనకర పరిస్థితి నెలకొన్నదన్నారు. వ్యాపారస్తులు నెలకొన్న పలు సందేహాలను నివృత్తి చేయాలని, అధికారులు వ్యాపారస్తులు మరియు అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. గత రెండు రోజుల క్రితం పట్టణంలో వ్యాపారస్తులు ధర్నాకు దిగారని, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పై అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడ్డ విషయాలను తన దృష్టికి తీసుకో రావడం జరిగిందని తెలిపారు. వీరందరి పక్షాన నేడు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులను కలిసి వివరించడం జరిగిందన్నారు.

## వడ గాలులు వీస్తున్నాయి జాగ్రత్త

### మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 01-వడ గాలులు వీస్తున్నాయని అత్యవసర మైతే బయటకి రావాలని బయటకు వచ్చినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడ దెబ్బ లక్షణాలు. మరియు నివారణ ఎలా అనే దానిపై మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి వివరించారు. ఆయన సోమవారం మున్సిపల్ కార్యాలయం లో మాట్లాడుతూతీవ్రమైన వడగాల్పులు వీచినపుడు వడదెబ్బకు గురి అయ్యే అవకాశం ఉంది. దాని లక్షణాలు ఇలా ఉంటాయని తెలిపారు . తీవ్రమైనతలనొప్పి. నాడి వేగంగా కొట్టుకోవడం. నాలుక ఎండిపోవడం. శరీరంలో నీటిని కోల్పోవడం. పాక్షిక లేదా పూర్తిగా అపస్మారకస్థితికి చేరుట. ఇలాంటి లక్షణాలు వడ దెబ్బ తగిలిన వారికి కనిపిస్తాయి. వెంటనే ప్రథమ చికిత్స చేయించుకోవాలనిసూచించారు. వడదెబ్బకు గురి అయిన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి చేర్చాలి. శరీరాన్ని చల్లని నీటిలో ముంచినగుడ్డతో తుడవాలి. వడదెబ్బ తగిలిన వారికి ఉప్పు కలిపినచల్లారిన నీరు, కొబ్బరి నీళ్ళు, గ్లూకోజ్ మరియు ఇతరలవణాలు(ఓ.ఆర్.ఎస్) కలిపిన నీటిని త్రాగించాలి."జాగ్రత్తలు"? ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం,ఆడటం చేయరాదు. తప్పని పరిస్థితిలో ఎండలోకి వెళితేఛత్రి, టోపీ, తలపాగ తప్పక ధరించాలి. తెల్లని నూలువస్త్రాలు ధరించాలి. నీరు మరియు ఇతర ద్రవ పదార్థాలువీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. వడదెబ్బకు గురైన వారినిఏ మాత్రం ఆలస్యం చేయకుండా దగ్గరలో ఆసుపత్రికి తరలించాలి.

## మున్సిపాల్టీకి 62%90 శాతం పన్ను వసూలు

**ఆస్తి పన్ను ఖాళీ స్థలం పన్ను 17 కోట్ల 65 లక్షలు.**
**నీటి పన్ను 3కోట్ల 60 లక్షలు వసూలు**
**మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 01-నంద్యాల మున్సిపాలిటీకి 2023-2024 ఆర్థిక సంవత్సరమునకు సంబందించిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నులు 17కోట్ల. 65 లక్షలు మరియు నీటి చార్జీ పన్ను 3 కోట్ల. 60 లక్షలు మున్సిపల్ సిబ్బంది సచివాలయ సిబ్బంది కలిసి వసూలు చేసారని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం లో కమిషనర్ మాట్లాడుతూ నంద్యాల మున్సిపాలిటీకి వివిధ పన్నుల రూపంలో 28 కోట్ల 80 వేలు రావాల్సి ఉందన్నారు. దాదాపుగా 62%90 శాతం వసూలు చేసారని అన్నారు. సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తొడ్పడిన పురప్రజలకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పురపాలక సంఘ ఉద్యోగులు మరియు సచివాలయ ఉద్యోగులందరు ఎన్నికల విధులలో ఉన్నప్పటికి 2023-24 ఆర్థిక సంవత్సరమునకు సంబందించిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నులు మరియు నీటి చార్జీలను సకాలంలో వసూలు చేసినందున ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు .

## కారు ఆటో డీ ఒకరు మృతి...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఏప్రిల్ 1 డోన్ మండల పరిధిలోని గోసానిపల్లె గ్రామానికి వెళ్లే కరేపాకు తోట సమీపంలో ఊటకొండ కు చెందిన ఆటో కర్నూలుకి చెందిన కారు ఢీకొనడంతో ప్యాపిలి మండలం ఊటకొండ గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు అనే వికలాంగుడు అక్కడికక్కడే మరణించగా అతని కుమారునికి, ఆటో డ్రైవర్ కి తీవ్ర గాయాలు కాగా కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయయి .

## అధికార పార్టీ వాళ్లకి వత్తాసు పలికే వారిపై చర్యలు తీసుకోవాలి

**నిజంగా డబ్బు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి తప్ప ... సామాన్య ప్రజలపై కాదు,**



నంద్యాల జిల్లా :-01-04-2024, నంద్యాల పట్టణంలో రెండు రోజుల కిందట ఒక వ్యాపారస్తుడు తన వ్యాపారం ముగించుకొని అందులో వచ్చిన డబ్బును ఇంటికి తీసుకుపోతున్న తరుణంలో వారిపై రైడ్ చేసి వారి దగ్గర నుంచి అక్రమంగా డబ్బు తరలిస్తున్నారని ఉద్దేశంతో వారిపై కేసులు నమోదు చేసి వారి దగ్గర నుంచి డబ్బు స్వాధీనం చేసుకోవడం సబవు కాదని నంద్యాల టిడిపి ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక నంద్యాల జిల్లా కలెక్టరేట్ సమీపంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నంద్యాల అనేది వ్యాపారానికి ప్రసిద్ధి అని ఇక్కడ రోజుకు కొన్ని లక్షలలో వ్యాపారం జరుగుతూ ఉంటుందని అటువంటి తరుణంలో వ్యాపారస్తులపై దాడి చేసి వారి డబ్బును సీజ్ చేయడం ఎంతవరకు సమంజసం అని వారు రేపు పొద్దున వ్యాపారాలు చేసుకోవాలనా వద్దా అని ప్రశ్నించారు ఇంకా రెండు నెలలు ఎలక్షన్లకు టైం ఉందని వ్యాపారం వద్దు అంటే ఈ అధికార పార్టీ వాళ్లు వారికి నెలకు సరిపడా అంతా జీతాలు ఇస్తారా అని ప్రశ్నించారు కాబట్టి అధికార పార్టీ వాళ్లకు కొమ్ముకాసి వారికి ఆర్థికంగా సహాయపడే వారిని , దొంగదారులలో డబ్బులను తరలించే వారిపై చర్యలు తీసుకోవాలి తప్ప వ్యాపారులపై కాదు అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## దొంగ రిజిస్టర్ పత్రాలతో ప్రభుత్వ భూములుస్వాహా....

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఏప్రిల్ 1 దొంగ రిజిస్టర్ పత్రాలతో పట్టణంలోని 503 సర్వే నెంబర్ లో గల ప్రభుత్వ భూమిని కాజేయాలని పన్నాగం పన్నిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల పై క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని దొంగ రిజిస్టర్ పత్రాలను రద్దు చేయాలని సిపిఎం పట్టణ మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్,కోయిలకొండ నాగరాజు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు యస్.ఏ.చిన్న రహిమాన్ డిమాండ్ చేశారు.సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం నందు ఆర్డిఓ మహేశ్వర్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని గుత్తిరోడ్డు దగ్గర ఉన్న 503 సర్వే నెంబర్లు ప్రభుత్వానికి చెందిన 8 ఎకరాల 51 సెంటు ప్రభుత్వ భూమి ఉన్నది. కానీ దానిపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడడంతో మాన్యువల్ రెవెన్యూ రికార్డులు ఉన్నప్పుడు ఆనాటి రెవెన్యూ అధికారులు,రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుమ్మక్కై ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులపై ఐదు ఎకరాల 51 సెంటును రెవెన్యూ రికార్డులో



ఎక్కించుకోవడం జరిగిందని వారన్నారు ఇంకా మిగిలి ఉన్న మూడెకరాల ప్రభుత్వ భూమిపై ఇప్పుడు మరి కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్ను వేసి 1989లో కొనుగోలు చేసినట్లు దొంగ రిజిస్టర్ పత్రాలు తయారు చేసుకుని ప్రభుత్వ భూమిలో ప్లాట్లు ఏర్పాటు చేసి అమ్ముకుంటున్నారని వారు తెలిపారు. గత వారం రోజుల క్రితం ఈ భూమి ప్రభుత్వానిది కాదు తమదని దొంగ రిజిస్టర్ పత్రా లు చూపించి ప్రభుత్వ సర్వే పేరుతో ప్రభుత్వ సర్వేయర్ కు ముడుపులు ముట్ట చెప్పి ప్రభుత్వ రికార్డులలో వారి పేర్లు ఆన్లైన్ చేయించుకోవడానికి దొంగ దారిన ప్రయత్నిస్తున్నారని వారన్నారు. గత మండల తాసిల్దార్ విద్యాసాగర్ ని సమాచార హక్కు చట్టం ద్వారా 503 సర్వే నెంబర్ లోని భూమి వివరాలు కోరగా 503 సర్వే నెంబర్లు మూడు ఎకరాలు ప్రభుత్వానికి చెందినది ఉన్నదని లిఖితపూర్వకంగా ఇవ్వడం జరిగింది, కానీ ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వానికి చెందిన మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాహా చేయడానికి పూనుకోవడం జరిగిందని దాన్ని కట్టడి చేయాలని వారు కోరారు. కావున తక్షణమే ప్రభుత్వ సర్వేను నిలుపుదల చేసి ప్రభుత్వ భూమి స్వాహా చేయడానికి పూనుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై క్రిమినల్ కేసు నమోదు చేసి దొంగ రిజిస్టర్ పత్రాలను రద్దుచేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని ఇల్లు లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల పట్టణంలోని ఇల్లు లేని నిరుపేదలను కూడగట్టి పెద్ద ఎత్తున ఆర్డిఓ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి, డివైఎఫ్ఐ మండల నాయకులు మనోహర్, రామలింగం,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190